# గొడుగు

పిల్లలకు అర్థం చేసుకునే వయస్సు వచ్చేవరకు, వాళ్ళ తప్పేమిటో వాళ్ళకు తెలియజెప్పాలి. అంతేగాని తప్పు చేసావని దండించి ఊర్కోకూడదు.

—జయప్రద

"ఏయ్ మధూ! అవి నా బొమ్మలు నువ్వు ముట్టుకుంటావేం?"

"ఓయబ్బ బోడి బొమ్మలు. నేనూ కొనుక్కుంటాను మా నాన్న నడిగి ఇంకా మాంచి బొమ్మలు."

"ఆఁ కొంటాడు కొంటాడు పోమ్మా వెళ్ళి కొనుక్కో. అదుగదుగో మీ నాన్న వస్తున్నాడు పోరా వెళ్ళి అడుగూ...."

పదేళ్ళ మధును పెద్దనాన్న కొడుకు మాటల్లోని వ్యంగ్యభావం మరింత రెచ్చగొట్టబోయింది కానీ అల్లంతదూరాన తూలుతూ వస్తున్న

తండ్రిని చూడగానే వాడి ఛాలెంజ్ తత్వం నీరుకారి పోయింది. మెల్లిగా నడిచి వెళ్ళి జాకెట్టు కుడ్తున్న తల్లిదగ్గర కూర్చున్నాడు.

"అమ్మా! నాకో బొమ్మ కొనీవా?" మధు తల్లివైపు ఆశగా చూసాడు.

తలెత్తిందామె.

ఈ ఉదయం తన పెట్లో మాయమయిన డబ్బుల్ని సారాగా మార్చి తాగి తూలుతూ వస్తున్న భర్తను చూడగానే ఆమె గుండెలు మండాయి. ఆ మంటల్లో కొడుకు ఆశ సమిధి అయింది.

"నీ బతుక్కి, నీ బాబు బతుక్కి బొమ్మలు కొనుక్కునే తాహతు కూడానా? నువ్వుకూడా ఎక్కడయినా కన్నంవేసి కొనుక్కోరా బొమ్మలు"

తూలుతున్నవాడల్లా ఆగి భార్యవైపు కోపంగా చూశాడతను. జేబులో వున్న సారాసీసా తీసి మరో గుటకేసి మరలా తూలుకుంటూ వెళ్ళిపోయాడు. తల్లి వైపు మధు దిగులుగా చూసి దయనీయంగా కదిలితే ఆమె కళ్ళల్లో కన్నీరూరింది.

* * * *

"ఏరా అన్నం తినలేదంట" ప్రక్కింటిలో పైరివేటు చెప్పి అలసిపోయి వచ్చిన అరుంధతి విసుగ్గా అడిగింది కొడుకుని.

"నిన్నేరా చెముడా విన్పించడంలా?"

"నా పిల్లినెందుకు తరిమేయాలి?"

"ఏమంట తరిమేస్తే"

"నేను నా ఫ్రెండ్ దగ్గరనుండి తెచ్చుకున్న పిల్లిపిల్లది. దాన్ని మీరేమన్నా కొనిచ్చారా? మీరెందుకు తరిమేయాలి?"

"అయితే దానికి తిండి నువ్వు పెడ్తావా? నీ బాబు పెడ్తాడ్రా? మీ ఇద్దర్నే సాకలేక ఛస్తుంటే పైగా ఈ పిల్లి ఒకటి నా ప్రాణానికి."

వాడు దుప్పటి విసిరి కొట్టాడు. ఉక్రోషంగా లేచి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్ళి వంటింట్లో పీటమీద కూర్చున్నాడు.

బిడ్డకు వడ్డిస్తున్న తెల్లటి అన్నంలో ఆమె కన్నీరు రాలి పడింది.

'ఎప్పుడు? ఎప్పుడు తెలుసుకుంటాడు వీడు!'

*    *    *    *

మధు బెరుగ్గా వచ్చి నేలమీద చతికిల పడున్న తల్లి దగ్గర కూర్చున్నాడు.

"అమ్మా! సినిమా కెళదామమ్మా!"

ఆమె మాట్లాడలేదు. అప్పుడే బాధ్యతలేని భర్తతో తగువేసుకుని మనసు కలత పర్చుకోనుందామె.

"చాలా రోజులయిందమ్మా" అమ్మ వెంటనే కోప్పడక పోవడంతో అమ్మ చెయ్యి పూపుతూ మారాం చేయబోయాడు మధు.

"వెళదాంరా, మీ అబ్బ సంపాయించి రాసులు పోసున్నాడు చూడూ ఆ డబ్బుతో నువ్వూ నేనూ సినిమాకెళదాం".

ఆమె గొంతు బొంగురు పోయింది.

అక్కడే కూర్చుని నాటుసారా తాగుతున్న తను కశ్శైత్తి కోపంగా భార్యవైపు చూసి మరలా తాగడంలో నిమగ్నమై పోయాడు.

మధు గుండెల్లో తండ్రి ప్రవర్తన పట్ల జుగుప్స, వెనగ్గా తనకు తల్లీ తండ్రీ కూడా ఏమీ చేయడం లేదనే విరక్తి భావం, తన కెవ్వరూ లేరనే ఒంటరితనం వాడు తల వంచుకుని వెళ్ళిపోయాడు.

ఆమె గుండె కన్నీరు కార్చింది. కవాటంలో కన్నీరు మెదడు పొరల్లో పశ్చాత్తాపం.

"అమ్మా! నేను బొమ్మ చేసాను చూసావా! డ్రాయింగు మాష్టారు మెచ్చుకున్నారు కూడాను."

అమ్మ ఆనందిస్తే బాగుణ్ణనే బలమయిన కోరికను అణుచుకోలేక తన బుక్ తల్లికి చూపాడేగాని ఒక ప్రక్క భయయే. చదువుకోకుండా బొమ్మలు గీసిన తనని ఏమి తిడ్తుందో అని.

వాడి అంచనాని తారుమారు చేస్తూ వాడి గుండేల్లో పన్నీటి జల్లు కురిపిస్తూ చప్పున వాడిని గుండెకు హత్తుకుని నొసటిమీద ముద్దుపెట్టు కుంది ఆమె.

ఈ మధ్య చాలా కాలంగా వాడి శరీరాన్ని ఆవహించిన మానసిక నీరసం ఒక్కసారిగా తుడిచి పెట్టుకు పోయింది.

తల్లి ప్రేమగా ఇచ్చిన ఒకేఒక్క ముద్దుతో కొన్ని కోట్ల టన్నుల శక్తి వాడి రక్తంలో ప్రవహించి రిహార్సల్స్ లేకుండా నోరు తెరిచేలా చేసింది.

"అమ్మా! నాకో కలర్ బాక్స్ కొనివ్వా?"

ఆమె మాట్లాడలేదు. ఆశగా చూసాడు వాడు.

"మధూ! కడదాకా నీ చదువు ఏ అడ్డం లేకుండా జరిగిపోతే అంతేచాలు నాయనా. ఆ తర్వాత నువ్వే నీ చెల్లెలికి పెళ్ళి చేస్తావు"

బెలూన్ పగిలి పోయింది.

'అమ్మ తనని కడదాకాకూడా చదివించలేరా? తను ఎదిగి పెద్దయి చెల్లెలు పెళ్ళి చేయగలడా?' వాడి ధైర్యాన్ని, క్షేమ భారాన్ని చంపేస్తూ వాడిలో కొండంత భయం.

* * * *

"నువ్వేమయినా మహారాజువనుకున్నావట్రా వాసుని కొట్టడానికి"

మేనమామ దగ్గరనుండి ఎదురు చూడని యీ దెబ్బకు బిత్తర పోయాడు మధు

మేనమామ ప్రక్కన నిల్చున్న వాసును చూస్తూనే ఆ దెబ్బకర్థం బోధ పడింది మధుకి. ప్రొద్దున తను ముచ్చటపడి వేసుకున్న తల్లి బొమ్మమీద పిచ్చి గీతలు గీసాడు పెదనాన్న కొడుకు వాసు.

అదేమని అడిగితే 'ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోపో' అని కొట్టాడు. అప్పుడు తను తిరిగి కొట్టినందుకు తీర్పున్నమాట ఇది.

మధుకి ఆవేశం వచ్చేసింది.

"వాడు తప్పు చేసాడు కొట్టాను. దానికి కూడా దబ్బుండాలా?"

"అవును. నువ్వు న్యాయమూర్తివి కొడుకువి కదూ! అందుకని తప్పు చేసిన వాళ్ళనందరినీ శిక్షిస్తావురా. పైగా పెద్దాచిన్నా లేకుండా మామయ్య నెదిరిస్తావురా రాస్కెల్" మధూ చెంప ఛెళ్ళుమంది.

"మూల కూర్చుని త్రాగడానికి డబ్బెలా!" అని దిగులుపడుతూ ప్రొద్దున్నే తండ్రికి కోపమొచ్చింది.

తన బిడ్డను తప్పు లేకుండా భార్య శిక్షిస్తున్నందుకు కాదుకోపం తన భార్య తనని న్యాయమూర్తని హేళన చేసినందుకు.

మధుకి ఈసారి చాలా కోపం వచ్చింది. అమ్మను ఏమీ చేయలేక ఆమె తాగుతూ అపై బెంచీమీద పెట్టిన కాఫీ గ్లాసు పగల గొట్టేసి వీధిలోకి పరుగు తీసాడు.

కొడుకు వెళ్ళిపోయాక అన్నను పెరట్లోకి తీసుకెళ్ళి కష్టం సుఖం చెప్పుకుంటూ అంది అరుంధతి.

"అన్నయ్యా! నా దిగుళ్ళలో, నా విరక్తిలో ఈయనమీద కోపంతో అనవసరంగా మధూని కోప్పడుతున్నాను పాపం"

"బాధపడకమ్మా! ఆ మాత్రం స్ట్రిక్ట్‌గా పెంచకపోతే బావలా వాడూ పాడయితే భరించగలమా చెప్పు? పైగా పరాయి బిడ్డను మన మేమీ అనలేం. మన బిడ్డనే మనం భయపెట్టుకోవాలి"

"నిజమే" నిట్టూర్చింది అరుంధతి.

★ ★ ★ ★

"అమ్మా!" అనే పిలుపుకు తృళ్ళిపడి న్యాయమూర్తి వైపు చూసింది అరుంధతి.

అతను ఎలిమెంటరీస్కూలు టీచరు. సంవత్సరం రోజులుగా ఈ ఇంట్లో అన్నం తింటున్న పేయింగ్ గెస్ట్.

అతను తనతో మాట్లాడే అవసరం తనింతవరకతని కివ్వలేదు. తాగడానికి తప్ప మరెందుకూ పనికిరాని తన భర్త తనలో ఏ చిన్న లోపమున్నా దాన్ని ఆధారంగా తీసుకుని భార్యను దోషిని చేయడానికి ఎదురు చూస్తున్నాడని ఆమెకు బాగా తెలుసు.

ఆ అవకాశం తన భర్తకిచ్చి నలుగురు నోళ్ళలో పడడం ఇష్టం లేని ఆమె ఏ మగాడితోనూ మాట్లాడదు.

కానీ ఇప్పుడు అతని ఎదురుగా నిల్చుని పిలుస్తున్నాడు. పలకాలా వద్దా అని ఆలోచిస్తోందామె.

"మీరేమీ అనుకోకపోతే మధు గురించి కొద్దిగా మాట్లాడాలి"

కొడుకు ప్రొద్దుననగా వెళ్ళి ఇంతవరకు రాలేదు. ఆమె పేగు వాడి కొరకు అల్లాడి పోతోంది. ఇప్పుడు మధు గురించి మాట్లాడాలని అతననగానే ఆమెకు భయమేసింది.

"కూర్చో బాబూ! వాడికేమయింది?" ఆమె ఆదుర్దాను అతను అర్థం చేసుకున్నాడు.

"మధూ కేమీ కాలేదు....మీ సంసార విషయంలో నేను జోక్యం చేసుకోకూడదు కానీ యీ రోజు మధూ నా దగ్గర కొచ్చి...." అతను ఆగాడు.

ఆమె చెప్పమన్నట్లు చూసింది.

"మీరు వాడిని అనవసరంగా కోప్పడ్తున్నారనిపిస్తుందమ్మా."

ఆమె కళ్ళు పెద్దవి చేసుకుని చూసింది.

"మీరు వాడికి తల్లి. మీరు వాడిని కొట్టవచ్చుకానీ వాడిలో నా కెవరూ లేరనే భావాన్ని మాత్రం కలిగించకండి. వాడు చచ్చిపోవా లన్నంత విరక్తిలో వున్నాడు.

ఆమె ఇక నిల్చోలేనట్టు కుర్చీలో కూలబడి పోయింది.

"వాడు మీకేం చెప్పాడు"

"మధు ఈ రోజు జరిగిన సంఘటన మాత్రమే చెప్పాడు. ఈ ఇంట్లో అమె ఏమి జరుగుతుందో కొన్ని నెలలుగా నేనూ చూస్తున్నాను. ఏనాడూ నేను నోరు తెరవలేదు కాని ఈ రోజు కూడా నేను నోరు తెర వకపోతే వాడి జీవితం పాడైపోతుందని పించింది."

"మీరేం చెపుతున్నారో నా కర్థం కావడంలేదు. వాడు నాకు శత్రువు కాదుబాబూ నా కొడుకు."

"నాకు తెలుసమ్మా. మీరు మదుని బాగుచేసుకోవాలనే శిక్షిస్తు న్నారు. కానీ వాడు పసివాడనీ వాడి వయస్సుకు తగ్గ ఫీలింగ్స్ వాడి కుంటాయని మర్చిపోతున్నారు" అతను కొద్ది సంకోచంతో ఆగాడు.

"నిజమే. వాడిని నేనిప్పుడు బాధపెడుతున్నాను కానీ వాడి జీవి తమూ వాడి భావిజీవితమూ బాగుండాలనే నా తపన."

"మీ తపన నా కర్థమయిందమ్మా. మీరు...." అతను మాట పూర్తి చేయకముందే ఆమె అందుకుంది.

"నన్ను చెప్పనీ బాబూ! మా ఇంటి విషయాలు నీకు తెలియంది లేదని నువ్వే చెపుతున్నావు ఇంక దాపరికం దేనికి....

నా భర్త తాగుబోతు. ప్రపంచంలో తాగుబోతులు చాలామందే వున్నారు కానీ ఈయన అసమర్థుడు కూడా. ఆ అసమర్థులుకూడా ప్రపంచంలో తక్కువేమీ లేరు కాని ఈయన అసమర్థదుర్థనుడయ్యా.... అలా....అలా నా బిడ్డ కాకూడదనీ నాలా వాడి భార్య అశాంతిలో మగ్గి పోకూడదనీ...."

"నాకు తెల్సమ్మా! కానీ మధు వయస్సుకు తెలీదుకదమ్మా! ఆ వయస్సు ఎదిగేదాకా మనం విడమర్చి వాళ్ళకు చెప్పాలి.

తిట్టినా, కొట్టినా తర్వాత దగ్గరకు తీసుకుని ఇదీ నీ తప్పు ఇందుకూ నేను కొట్టింది అని చెప్పాలేకానీ తిట్టి ఊరుకోకూడదు.

తల్లిగా మీరు తిట్టినా, సమాజంలో వ్యక్తులంగా వాళ్ళ మేనమామో పెదనాన్నగారో లేక బళ్ళో టీచరో మేము మీ కున్నాము అదే ధయిర్యాన్ని వాడికివ్వాలి లేకపోతే ఈ ప్రపంచంలో వాడికి క్షేమకరమైన చోటే లేదనుకుంటాడు. తనను అదుకునేవాళ్ళే లేరు అని భయపడతాడు.

అప్పుడు....అప్పుడేనమ్మా చచ్చిపోవాలనే కోరిక పిల్లల్లో కల్గేది. ఈరోజు చూడండి. మీరు వాడి తప్పు లేకుండానే తిట్టారు వాడి మనస్సు ఎంత గాయపడింది? వాడిని సపోర్టుచేసే మనిషే లేడు అనే భావం వాడి కొచ్చేసింది"

ఆమె తనని తాను సమర్థించుకోవాలని ప్రయత్నించటంలేదు.

అతని నోటివెంట ఏమి వినాల్సి వస్తుందోనని భయపడుతూ వింటోంది.

"వాసు చేసింది తప్పుకాదు, మధు చేసిందీ తప్పుకాదు. పిల్లల్లో అసూయ సహజం.

మధు బొమ్మ బాగా గీసాడని వాసు ఇంట్లో అంతా మధుని మెచ్చుకున్నారు-బొమ్మలు గీయడం చేతకానివాడని వాసుని గేలిచేసి నట్టుగా తిట్టినందువల్ల వాసుకి అసూయ వచ్చింది.

మధు బొమ్మమీద గీతలు గీసాడు. మధుకి ఉక్రోషం రావడమూ సహజమే-ఇద్దరి తల్లులూ ఇద్దర్నీ దగ్గర కూర్చోబెట్టుకుని వివరించి చెప్పండి అంతేగానీ తప్పెవరిదయినా నా బిడ్డనే శిక్షించుకోవాలి అనే సంస్కారభావంతో మీరు మనసుల్ని రెచ్చగొడుతున్నారు.

మీరు కొట్టినా తిట్టిగా అమ్మ నాకోసమే అన్నది వాళ్ళకర్థమైతే చాలు".

"నిజమే! కాని మా అత్తగారు మావార్ని పట్టించుకోకే ఇలా తయారయ్యారనే భయంలో...."

గిల్టీభావంలో ఆగిందామె.

"పట్టించుకోకపోవడమూ మంచిదికాదు అప్పుడు తన తల్లి తనని నిర్లక్ష్యం చేస్తోందనీ, తనమీద ప్రేమ లేదనీ వాళ్ళకనిపిస్తుంది...."

ఇంకా ఏదో అనబోతున్న వ్యాసమూర్తి మధుని వాకిట్లో చూసి ఆగిపోయాడు.

మధు భయంగా, బెరుగ్గా చూస్తున్నాడు.

కొడుకుని చూడగానే అరుంధతిలో పెద్ద రిలీఫ్.

మనసంతా కొడుకుపట్ల జాలి, ప్రేమ.

'పాపం వీడిని నేను అనవసరంగా కష్టపెడుతున్నాను. ఇక నన్ను నేను నిగ్రహించుకోవాలి'

ఆమె చేతులు చాచింది.

వాడు ఒక సెకండ్ అయినా ఆగలేదు.

పరుగున వచ్చి తల్లి గుండెల్లో ఒదిగిపోయాడు.

*